
క్లుప్తంగా

ఏలేరులో 68.65 మీటర్ల నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: వేసవి కావడంతో స్థానిక ఏలేరు జలశయంలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటిసరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో నీటి నిల్వలు తగ్గాయి. ఆదివారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు గాను 68.65 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 3.65 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దిగువ ప్రాంతంలో సాగు లేకపోవడంతో నీటి సరాఫరా నిలిపివేశారు. విశాఖకు 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజుచెరువుకు నీటి సరాఫరా నిలిపివేశారు. కాగా గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో వర్షాలు పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి లేకుండా ఊరేగింపులు చేస్తే చర్యలు

తుని: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పట్టణంలో ఎటువంటి ఊరేగింపులు నిర్వహించవద్దని తుని పట్టణ సీఐ గీతారామకృష్ణ అన్నారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం కౌంటింగ్‌ను పురస్కరించుకుని 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతి లేకుండా ఊరేగింపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

కానిస్టేబుల్ గణేశ్వరరావుకు అభినందనలు



కాకినాడలో గణేశ్వరరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కిర్లంపూడి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి.గణేశ్వరరావును జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అభినందించారు. కాకినాడలో ఆదివారం నగదుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. గత నెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో కృష్ణవరంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా విధులు నిర్వహించిన గణేశ్వరావుకు అరుదైన గౌరవం దక్కిందని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. గణేశ్వరావును పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు అభినందించారు.

విరబూసిన మే పుష్పాలు



కొత్తపల్లిలో విరబూసిన మే పుష్పాలు

కొత్తపల్లి: స్థానిక కాకరపల్లి గంగాధర్‌రావు స్వగృహం వద్ద ఆదివారం మే పుష్పాలు విరబూశాయి. ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న మొక్కలు ఒకేసారి 13 పుష్పాలను పూసి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. వీటిని పలువురు తమ సెల్‌ఫోన్‌లో బంధించారు.

కౌంటింగ్‌డౌన్ స్టార్ట్

- రేపే ఎన్నికల కౌంటింగ్
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో 80.45 శాతం పోలింగ్
- ఉత్కంఠ రేపుతున్న ఎగ్జిట్ పోల్స్



ఏలేశ్వరంలో ఓటు వేసేందుకు భారీగా క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనుండటంతో ప్రత్తిపాడు నియోజకవర్గవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. అన్నిపార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు సైతం ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరో 24 గంటలు అభ్యర్థులు క్షణమొక యుగంగా లెక్క పెట్టుకుంటుంటే అభిమానులు నిమిషాలు, గంటలు లెక్క పెట్టుకుంటున్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడటంతో అందరిలోనూ ఆసక్తి, టెన్షన్ పెరిగాయి. గ్రామాల్లో సైతం ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాల గురించే చర్చలు జరుగుతున్నాయి.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం

ఎగ్జిట్ పోల్స్ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా కనిపిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకర్గ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో 80.45 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు ఉండగా 1,74,788 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 87,812 మంది, స్త్రీలు 86,968 మంది ఇతరులు 8 మంది ఉన్నారు. ముఖ్యంగా మహిళలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపారని సర్వేలు చెబుతున్నాయి. దీంతో తమ పార్టీ గెలుపు ఖాయమని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హ్యాట్రిక్‌పై గురి

ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్‌పై గురిపెట్టింది. నియోజకవర్గంలో 2014, 2019లో వైఎస్సార్ సీపీ విజయం సాధించగా ముచ్చటగా మూడోసారి విజయంపై ధీమాతో ఉంది. దీనికి తోడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు గతంలో రెండుసార్లు విజయం సాధించగా మూడోసారి గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా బెట్టింగ్‌లు

నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నారు. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, మెజార్టీ, ఓటింగ్ శాతం ఇలా పలు రకాలుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. నియోజకవర్గంతో ఏ పార్టీ గెలుస్తుందని కొందరు, ముఖ్యమంత్రి ఎవరు అనే దానిపై మరికొందరు బెట్టింగ్‌లు వేస్తున్నారు. అప్పులు చేసి మరీ బెట్టింగ్‌లు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు రెట్టింపు పందేలు కాస్తున్నారు. ఒక పార్టీ వైపు రూ.లక్ష అయితే మరోపార్టీ వైపు రూ.50 వేలు చొప్పున పందేలు కాస్తున్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



సిటీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ శివాజీ

తుని: నడకతో ఆరోగ్యం సురక్షితమని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ చదరం శివాజీ అన్నారు. స్థానిక గణపతినగర్ మున్సిపల్ పార్కులో ఆదివారం సిటీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం తుని శాఖ అధ్యక్షుడు ఆర్‌ఎస్ఎస్ మూర్తి అధ్యక్షతన జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు, కార్యదర్శి ఎన్‌వీజీ రాజు, సంయుక్త కార్యదర్శి ఎస్.వెంకటేష్, కోశాధికారి సత్తిబాబుతో గవర్నర్ చదరం శివాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నూతన కార్యవర్గాన్ని సంఘ గౌరవాధ్యక్షుడు కుచ్చర్లపాటి భీమరాజు, చోడిశెట్టి త్రిమూర్తిస్వామి, తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ, తుని వాకర్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా సీఐ గీతా రామకృష్ణను ఘనంగా సత్కరించారు. వాకర్స్‌ను చైతన్యం పరిచేందుకు కృషి చేస్తామని సంఘ నూతన అధ్యక్షుడు సోమేశ్వరరావు తెలిపారు.

వైభవంగా తలుపులమ్మతల్లి జాతర



కోటనందూరులో బోనాలతో శోభాయాత్ర చేస్తున్న మహిళలు

కోటనందూరు: స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో వేంచేసిన తలుపులమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున గ్రామంలో బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చల్లబడిన వాతావరణం



గోకవరంలో ఆకాశం మేఘావృతమై ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణం

గోకవరం: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో ఆదివారం వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. దీంతో గత కొద్ది రోజులుగా భానుడి ప్రతాపం, వడగాడ్పులతో అల్లల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. మరి కొద్దిరోజుల్లో రుతుపవనాలు రాష్ట్రమంతా వ్యాపిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్దిరోజుల పాటు వాతావరణం ఇదేలా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్

కాకినాడ సిటీ: కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె నివాస్ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల బయట భోజన వసతి, మొబైల్ ఫోన్ల కౌంటర్ల ఏర్పాటుపై ఆయన సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేపట్టామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు పడకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ నివాస్ వెంట జగ్గంపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం శ్రీనివాసరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ శ్రీనివాసరావు, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

పంచారామ క్షేత్రంలో ఏకాదశి పూజలు



పంచారామ క్షేత్రంలోని ఉత్సవమూర్తులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి శివలింగం జీర్ణోద్ధరణ పనులు జరగడంతో నంది మండపంపై ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులకు ఆలయ పండితులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం సమీపంలో ఉన్న శివలింగానికి పాలతో, ఆలయ పుష్కరణిలోని నీటితో అభిషేకాలు చేసి, ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు. ఆలయ పండితులు అల్లాకి రాజ్‌గోపాల్ శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్నలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విజ్ఞానం.. వినోదం

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు
- విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ
- సెలవులు సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ
- ఉత్సాహంగా హాజరవుతున్న విద్యార్థులు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వీరవరం గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కిర్లంపూడి: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వారికి విజ్ఞానం, వినోదం అందించేందుకు ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. దీంతో జగ్గంపేట నియోజకవర్గంలోని గ్రంథాలయాలు ప్రత్యేక విజ్ఞాన, వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు సైతం ఈ శిక్షణా తరగతులకు ఉత్సాహంగా హాజరవుతున్నారు.

నియోజకవర్గంలో ఎనిమిది గ్రంథాయాలు

జగ్గంపేట నియోజకవర్గంలోని కిర్లంపూడి, గోకవరం, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో సుమారు 8 గ్రంథాలయాలు ఉన్నాయి. ఆయా గ్రంథాలయాల్లో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగనున్నాయి. వాస్తవంగా వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 29న ప్రారంభం కావాల్సి ఉండగా, సార్వత్రిక ఎన్నికల కారణంగా ఈ నెల 15న ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

శిక్షణ ఇలా...

వేసవిలో విద్యార్థులకు డ్యాన్స్, యోగా, చదరంగం, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణ ఇవ్వడంతో పాటు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిషు, జనరల్ నాలెడ్జ్, నీతి కథలు, పుస్తక పఠనం ఇలా అనేక అంశాలను నేర్పిస్తున్నారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్నారు. అలాగే శిక్షణా తరగతులు సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నారు.

స్థానిక గురువుల సహకారంతో...

వేసవి శిక్షణా తరగతుల నిర్వాహణకు ప్రభుత్వం నుంచి ఒక్కో గ్రంథాలయానికి సుమారు రూ.10 వేల వరకు అందిస్తుండగా వీటిని విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ ప్యాకెట్ల కొనుగోలు కోసం వెచ్చిస్తున్నారు. అలాగే పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి స్థానికంగా ఆయా రంగాల్లో నిష్ణాతులైనవారి సహకారం తీసుకుంటున్నారు. చెస్, క్యారమ్స్, యోగా, డ్యాన్స్, వంటి అంశాల్లో అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉపాధ్యాయుల సహకారం కూడా తీసుకుంటున్నారు. వీరంతా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

కోచ్‌ల సహకారంతో శిక్షణ



గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. కిర్లంపూడి గ్రంథాలయంలో ఏటా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు డ్యాన్స్, యోగా, చెస్, క్యారమ్స్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి స్థానికంగా కోచ్‌లు సహకరిస్తున్నారు. విజ్ఞాన తరగతుల ముగింపు సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తాం.

– డి.మరిడిబాబు, గ్రంథాలయ అధికారి, కిర్లంపూడి

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



రామచంద్రపురంలో శివలింగానికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రపురంలో ఆదివారం భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాథ్ ఆధ్వర్యంలో నమామి శ్రీసాయి శత రుద్రీయం కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వేదాధ్యయన సమన్వయకర్త కొఠారు సాయిశ్రీవరప్రసాద్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యసాయిబాబా చిత్రపటంతో నగర సంకీర్తన, ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిశ్రీ వరప్రసాద్‌శర్మ మాట్లాడుతూ లోక కల్యాణార్థం రాష్ట్రవ్యాప్తంగా 108 ప్రదేశాలలో నమామి శ్రీసాయి శత రుద్రీయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక, పరసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తుమ్మల బాబు, తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, బండారు వరప్రసాద్, అడబాల కొండబాబు, బులుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు నీటిగండం

- మెట్టలో వరుణుడు కరుణిస్తేనే ఖరీఫ్ సాగు
- తొలికరి వర్షాలపై రైతుల ఆశలు
- గతేడాది అరకొరగానే వర్షాలు



ఎన్.చామవరం వద్ద ఎండిపోయిన పుష్కర కాలువ



రాజుపేటలోని సీతయ్య చెరువులో అడుగంటిన జలాలు

తుని రూరల్: తొలకరి సమీపిస్తున్నా ఖరీఫ్ సాగుకు చుక్కనీరు కానరావడం లేదు. గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో ఖరీఫ్ సాగు జరగలేదు. వాతావరణం అనుకూలించి వరుణుడు కరుణిస్తే ఈ సంవత్సరం తొలకరి పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు మరో వారంలో ఆంధ్రప్రదేశ్‌కు చేరుతాయన్న వాతావరణశాఖ ప్రకటన రైతుల్లో ఆశలు నింపుతోంది. సకాలంలో వర్షాలు కురిస్తే మెట్ట ప్రాంతమైన తుని సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాగు పనులు చేపట్టాలని రైతులు చూస్తున్నారు.

29 వేలు ఎకరాల్లో వరి

నియోజకవర్గంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 29 వేల ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో పత్తి నాట్లు వేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. మరో రెండు వేల ఎకరాల్లో ఆరుతడి పంటలైన కూరగాయలు, మిరప, మొక్కజొన్న, చిరుధాన్యాలను రైతులు సాగు చేస్తారని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు ఆదాయం లభిస్తుందని, ఆ దిశగా రైతులును వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

గతేడాది తగ్గిన వర్షపాతం

2023–24 సీజన్‌లో నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 3127.25 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కావలసి ఉండగా 2601.94 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 525.31 మిల్లీ మీటర్ల తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలకు నీటి ఎద్దడి ఏర్పడింది.

సాగునీటి వసతులు

నియోజకవర్గానికి ప్రధాన సాగునీటి వనరులు పరిమితంగానే ఉన్నాయి. అందుబాటులో ఉన్న పంపా, తాండవ జలాశయాలు, చెరువులు, విద్యుత్ బోరుబావులు, వర్షాధారంపై ఆధారపడి రైతులు ఖరీఫ్ సాగు చేయాల్సి ఉంది. గత సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదుకావడం, జలాశయాల నుంచి ఆశించిన స్థాయిలో నీరు అందకపోవడంతో కొంతమేర పంటలకు నష్టం వాటిల్లింది. తొండంగి మండలంలో 13,500 ఎకరాలకు పంపా రిజర్వాయర్, కోటనందూరు మండలంలో తొమ్మిది వేల ఎకరాలకు తాండవ జలాశయాల నుంచి సాగునీరు అందాల్సి ఉంది. వర్షాధారంగా తుని మండలంలో 650 ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశాలు ఉన్నాయి.

తుని నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం

మండలం	వరిసాగు (ఎకరాల్లో)	పత్తిసాగు (ఎకరాల్లో)
తుని	6500	1250
తొండంగి	13500	200
కోటనందూరు	9000	50
మొత్తం	29,000	1500

మండలాల వారీగా గతేడాది నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	సాధారణ వర్షపాతం (మిల్లీ మీటర్లలో)	నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
తుని	1123.78	857.27
తొండంగి	1165.99	834.20
కోటనందూరు	837.48	910.47
మొత్తం	3127.25	2601.94

వర్షాలు కురిస్తేనే సాగు



మెట్ట ప్రాంతం కావడంతో సాధారణ వర్షాలతో పాటు రెండు మూడు భారీ వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సాగు ముందుకు సాగేది. వర్షాలు కురవకపోతే ఖరీఫ్‌లో పంట సాగు చేయడం కష్టమవుతుంది. గతేడాది నాట్లు వేసినా చివర్లో సాగునీరు అందక పంట ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లింది.

– చోడ్రాజు రామచంద్రరాజు, వ్యవసాయ మండలి చైర్మన్, తుని మండలం

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి



సంప్రదాయ పంటల స్థానంలో డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలి. పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనే గింజల సాగుపై రైతులు దృష్టి సారించాలి. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని